క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ వద్ద ఆందోళన



భీమవరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: భీమవరం పట్టణంలోని గాంధీనగర్, ప్రకాష్‌నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం టౌన్ నాయకుడు ఎం వైకుంఠరావు మాట్లాడుతూ ఇంతవరకు ఎస్సీ, ఎస్టీ ఏరియాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి గతంలో కలెక్టర్‌గా పనిచేసిన సుమిత్‌కుమార్ ఇచ్చిన హామీలను వివరించగా పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారని వైకుంఠరావు చెప్పారు.

భీమవరం డీఎస్పీ జయసూర్య బాధ్యతల స్వీకరణ



ఆర్‌జీ జయసూర్య

భీమవరం: భీమవరం డీఎస్పీగా ఆర్‌జీ జయసూర్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమవరం డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తానన్నారు. అనంతరం ఆయన భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారాన్ని తీసుకోవాలి



భీమవరం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: గర్భం దాల్చిన మూడు నెలల నుంచి ప్రసవం వరకు మహిళలు క్రమం తప్పకుండా పోషకాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యమంతమైన పిల్లలు పుడతారని ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు డాక్టర్ సుబ్బలక్ష్మి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు పౌష్టికాహారం అందించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం 84 మంది గర్భిణులకు రొట్టెలు, కోడి గుడ్లు, ఆకుకూరలు, పండ్లు పంపిణీ చేశారు. చెన్నమల చంద్రశేఖర్, చెరుకువాడ రంగసాయి, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలి

భీమవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాలు, పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలని వాటి వల్ల చదువు దెబ్బతినడమేగాక జీవితాలు నాశనమవుతాయని భీమవరం సెబ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలు, పొగాకు వినియోగం వల్ల కలిగే నష్టాలు, దుష్పరిణామాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సెబ్ సూపరింటెండెంట్ ఆర్‌సీహెచ్ చిట్టిబాబు, ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వి అరవిందస్వామి, పి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు,

అమ్మవార్లకు సారె సమర్పణ

పాలకోడేరు: మోగల్లులో పలు దేవాలయాలు, అమ్మవార్ల సంఘాల ఆధ్వర్యంలో గ్రామ ఇలవేల్పులు అయిన పిన్నేరమ్మ, మారమ్మ, కనకదుర్గమ్మ, పరాలమ్మ తదితర అమ్మవార్లకు శుక్రవారం ఆషాఢ మాస సారె సమర్పించారు. పలు రకాల పండ్లు, స్వీట్లు, చీరలు, గాజులు, పసుపు కుంకుమ పువ్వులు వంటి ద్రవ్యాలతో మేళ తాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం ఇంటింటికీ పలు రకాల పండ్లు, స్వీట్లు, కుంకుమ, పసుపు పంచారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

కాళ్ల: కాళ్ల మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ పనిచేస్తున్న శివారెడ్డి కుమారుడు బండి సూర్యప్రకాష్ రెడ్డి కాళ్ల మండలం ఎంపీపీ ఎస్ బొండాడగూడెం పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తినడానికి ఉపయోగపడే ప్లేట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: ఉండి చిక్కాలవీరన్న నగర్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై ఎం లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,430 స్వాధీనం చేసుకుని ఎస్సై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లిపాలు అమృత తుల్యం



గొర్లమూడిలో తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తున్న అధికారులు



పెన్నాడలో మాట్లాడుతున్న సీడీపీఓ వాణి విజయరత్నం

భీమవరం అర్బన్: తల్లిపాలు బిడ్డకు అమృత తుల్యమని పుట్టిన గంటలోపే ముర్రిపాలను శిశువుకు ఇవ్వవచ్చునని సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం అన్నారు. భీమవరం మండలంలోని ఎల్‌వీఎన్‌పురం, కొమరాడ గొర్లమూడిలో అంగన్‌వాడీ సెంటర్లలో శుక్రవారం తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో లక్ష్మీకాంతం మాట్లాడుతూ రెండేళ్ల వరకు తల్లిపాలు బిడ్డకు ఇస్తే వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాలల్లో పోషకాలు ఉండటం వల్ల బిడ్డ జీవితకాలం మంచి ఆరోగ్య స్థితిని పొందుతారన్నారు. బిడ్డ భవిష్యత్తులో విద్యలో చురుకుతనం, సానుకూల అభివృద్ధి, మంచి నైపుణ్యాలు, ఆలోచనలు కలిగి ఉంటారని పలు అధ్యయనాల్లో వెల్లడైందన్నారు. అనంతరం మిషన్ శక్తి పథకంపై మహిళల రక్షణకు కల్పించే చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అనిల్‌కుమారి, కె. సరళ, ఏఎన్‌ఎమ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

వీరవాసరం: మహిళలంతా పౌష్టికాహారాన్ని స్వీకరిస్తూ చక్కటి ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించాలని వీరవాసరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.కనకమహాలక్ష్మి తెలిపారు. వీరవాసరం అంగన్‌వాడీలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల ఉపయోగంపై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఏ. దేవదాసు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు పట్టాలి

కాళ్ల: పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు పట్టాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్య కుమారి తెలిపారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కాళ్ల సెక్టార్ బొండడపేటలో శుక్రవారం తల్లి పాలవారోత్సవం నిర్వహించారు. సర్పంచ్ జి.వి. వి.మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ తల్లిపాల ఆవశ్యకను గర్భిణులకు, బాలింతలకు వివరించారు. కార్యదర్శి సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే రోగనిరోధక శక్తి

పాలకోడేరు: పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తప్పనిసరిగా తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వాణి విజయరత్నం అన్నారు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పెన్నాడలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి విజయరత్నం మాట్లాడుతూ కామెర్లు, టైఫాయిడ్ , మలేరియా తదితర వ్యాధులను నిర్మూలించే గుణాలు తల్లిపాలలో ఉన్నాయన్నారు. వైద్యులు లీలా లక్ష్మి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే శిశు మరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనం ద్వారా వెల్లడైందని అన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, ఎంఎల్‌హెచ్ పి.వనిత పాల్గొన్నారు.

ముర్రుపాలు మురిపించెన్

ఆకివీడు: ముర్రుపాలు తల్లీ బిడ్డలకు ఎంతో శ్రేయస్కరమని, ఆరోగ్యకరమని ఎంపీపీ కఠారి జయలక్ష్మి చెప్పారు. మండలంలోని పెదకాపవరంలో తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించారు. వైద్యులు ఎం.రమేష్ మాట్లాడుతూ గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె.ప్రసాద్, ఎంపీహెచ్ఈఓ జె.సత్యనారాయణ, ఎం.మార్తమ్మ, రాజమణి, దైవాజ్ఞ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో చీరల వేలం

భీమవరం: భీమవరం పట్టణం గొల్లవానితిప్ప రోడ్డులో వేంచేసియున్న దుర్గాలక్ష్మి అమ్మవారిని భక్తుల సహకారంతో శాకాంబరిగా అలంకరించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు వేలం నిర్వహించగా రూ.30,160 ఆదాయం వచ్చింది. ఆలయంలోని హుండీలు లెక్కించగా రూ.50,362 ఆదాయం వచ్చిందని ఈఓ గొట్టుముక్కలు నాగ సీతారామరాజు తెలిపారు. దొడ్డిపట్ల కార్యనిర్వహణాధికారి రఘునాథ్, కలిగొట్ల ఈవో ఎం రామరాజు పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు.

అమ్మవారి వెండి చీరకు విరాళం

భీమవరం 33వ వార్డులో వేంచేసియున్న నూకాలమ్మవారికి వెండి చీర తయారీ నిమిత్తం 33వ వార్డుకు చెందిన గమిడి బాలసుబ్రమణ్యం- లక్ష్మి సౌజన్య దంపతులు, గమిడి శివ కార్తీక్- మౌనిక దంపతులు, బైరెడ్డి విష్ణు వర్ధన్- శ్రీ శివ మానస దంపతులు 250 గ్రాముల వెండి విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రౌతు అప్పారావు, మెట్టా మురళీకృష్ణ, సిరియాల నాగేశ్వరరావు, రౌతు హరిబాబు, తాళ్లపూడి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అభినందనీయం

ఉండి: విద్యార్థులను ప్రోత్సహించేందుకు చేసే దాతృత్వం చాలా గొప్పదని మండల కుల వివక్ష పోరాట సమితి కార్యదర్శి మాదాసి గోపీ అన్నారు. ఉండి కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ మాదాసి వెంకటేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉండి మండలం పాందువ్వ ప్రాథమిక పాఠశాలలో, అంగన్‌వాడీల్లో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు దాగారపు గోపాలం, అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, ఆర్‌ఎంపీ డాక్టర్ ఎం ప్రశాంత్, ఎం రామయ్య,దుర్గాప్రసాద్,పార్వతీ పాల్గొన్నారు.

చిట్టిరాజుకు ఎమ్మెల్సీల అభినందనలు



భీమవరంలో చిట్టిరాజును అభినందిస్తున్న ఎమ్మెల్సీలు రవీంద్రనాథ్, శ్రీనివాస్, వెంకటరమణ

భీమవరం: అవరోధాలెన్ని ఎదురైనా కృషి పట్టుదల ఉంటే విజయం సాధ్యమని కొయ్యే చిట్టిరాజు నిరూపించారని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. భీమవరంలోని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్‌రాజు నివాసంలో శుక్రవారం రవీంద్రనాథ్, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, జయమంగళం వెంకటరమణతో ఐపీఎస్‌కు ఎంపికైన చిట్టిరాజును అభినందించిన సందర్భంగా మాట్లాడారు. యూనియన్ పబ్లిక్ సర్వీసెస్‌పై ఉన్న మక్కువతో చిట్టిరాజు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి మొక్కవోని దీక్షతో కృషి చేసి ఇండియన్ పోలీస్ సర్వీసెస్ సాధించడం చూసి నేటి యువతరం స్ఫూర్తి పొందాలని రవీంద్రనాథ్ అన్నారు.అనంతరం చిట్టిరాజుకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఐపీఎస్ చిట్టిరాజుకు అభినందనలు

భీమవరం: సివిల్స్‌లో సత్తాచాటి ఐపీఎస్‌కు ఎంపికైన కొయ్యే చిట్టిరాజును పట్టణంలోని శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కంతేటి వెంకట్రాజు అభినందించారు. శుక్రవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు నివాసంలో ఆయన కుమారుడు చిట్టిరాజును కలిసి దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, నరహరిశెట్టి కృష్ణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కారుమూరి సుబ్బారావు తదితరులున్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌కు ఈటీఎస్ ఇండియా సంస్థ ప్రశంసాపత్రం



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

భీమవరం: విదేశాల్లో చదువుకునే విద్యార్థుల కోసం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జీఆర్‌ఈ, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్ వంటి పరీక్షలు నిర్వహించడంతో ఈటీఎస్ ఇండియా సంస్థ ఎస్ఆర్‌కేఆర్ కళాశాలకు ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందించిందని ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు తెలిపారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఈటీఎస్ ఇండియా సంస్థ ప్రతినిధి వంశీకృష్ణ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మకు ప్రశంసాపత్రాన్ని అందించిన సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎం జగపతిరాజు, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజా యోనాకు కళారత్న జాతీయ పురస్కారం



హర్యానా గవర్నర్ దత్తాత్రేయ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అద్దంకి రాజా యోనా

ఆకివీడు: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల కోసం విశేష కృషి చేస్తున్న అద్దంకి రాజా యోనాకు కళారత్న జాతీయ పురస్కారందక్కింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవాస భారతీయులతో కలిసి నిర్వహించే తెలుగు భాషా కార్యక్రమాలను గుర్తించి తనకు ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ ఈ అవార్డును ప్రదానం చేసినట్టు తెలిపారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హైదరాబాద్‌లోని తన నివాసంలో ఈ అవార్డును గత నెల 28న అందజేశారని చెప్పారు. ఈ సందర్భంగా గవర్నర్ దత్తాత్రేయకు, నిర్వాహకులు ఆర్. శేష సాయికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వార్డు వెల్ఫేర్ కార్యదర్శుల సమస్యలపై వినతి



ఎమ్మెల్యే అంజిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న వార్డు వెల్ఫేర్ కార్యదర్శుల సంఘం నాయకులు

భీమవరం: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేస్తున్న రాష్ట్ర వార్డు వెల్ఫేర్ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ వార్డు వెల్ఫేర్ కార్యదర్శుల సంఘం స్టేట్ ప్రధాన కార్యదర్శి హనీ ప్రవీణ్ కోరారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 125 మున్సిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలున్నాయని వాటిలో 3,358 మంది వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఐదేళ్ల అనుభవాన్ని పరిగణలోకి తీసుకొని సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగులుగా మార్పు చేయాల, సీనియర్ అసిస్టెంట్ పేస్కేలు ఇవ్వాలని, 2019 అక్టోబర్ నుంచి సర్వీస్ కాలంగా గుర్తించి నోషనల్ ఇంక్రిమెంట్లు అందించాలని, ఉద్యోగుల అభ్యర్థన మేరకు సాధారణ బదిలీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎం బాలాజీ, మద్ధ డేవిడ్‌రాజు, జి రామకృష్ణ, పి రమేష్, పి ధనకృష్ణ పాల్గొన్నారు.

తగ్గిన గోదావరి ఉధృతి




పడవలరేవులో రెండు పంటులకు లంగరు వేసిన దృశ్యం

నరసాపురం: గోదావరి ప్రవాహం స్థిరంగా కొనసాగుతుంది. గురువారంతో పోలిస్తే శుక్రవారం కొంతమేర నీటి మట్టంతో పాటు ఉధృతి తగ్గింది. అయితే వలంధర్‌రేవు, లిలితాంభఘాట్, పడవల రేవు వద్ద పరిస్థితి ఇంకా అదుపులోకి రాలేదు. దీంతో రేవులు నీట మునిగే ఉన్నాయి. బాబూఘాట్ వద్ద కూడా నీటమట్టం తగ్గ లేదు. ఎగువప్రాంతం నుంచి భారీగా వచ్చి చేరుతున్న వరద నీరు అంతే వేగంతో సముద్రంలోకి వెళుతుంది. మాధవాయిపాలెం ఫెర్రీ వద్ద పంటు రాకపోకలు ఇంకా పునరుద్ధరించలేదు. పంటు రాకపోకలు ఆగిపోయి 15 రోజులయ్యింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు మూడు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు భావిస్తున్నారు.

శాకంబరి అలంకరణలో అమ్మవార్లు





శాకంబరి అలంకరణలో పెద్దింటి అమ్మవారు, భీమవరం రామరాజు తోటలోని మావుళ్లమ్మ

ఆకివీడు: ఆషాఢ మాసంలో మాస శివరాత్రి సందర్భంగా అమ్మవార్లు శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. పలు అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు కూరగాయలతో అలంకరించారు. మాదివాడలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లను కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెదకాపవరంలోని పల్లాలమ్మ అమ్మవార్లకు గ్రామ మహిళలు ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించారు. మాదివాడలోని గాంధీనగర్‌లో కనకదుర్గమ్మకు మహిళలు సారె సమర్పించారు. మాస శివరాత్రి సందర్భంగా పలు శివాలయాల్లో శివలింగానికి పంచామృతాలు, అన్నాభిషేకాలు చేశారు.

శాకంబరిగా రామరాజుతోటలోని మావుళ్లమ్మ

భీమవరం: భీమవరం టూటౌన్ 36వ వార్డు రామరాజుతోటలోని మావుళ్లమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం శాకంబరిగా అలంకరించి సారె సమర్పించారు. మావుళ్లమ్మ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు రామాయణం వెంకటలక్ష్మీ తులసిపార్వతి, రేవూరి గోగురాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు బ్రహ్మజ్యోశ్యుల శంకరప్రసాద్ 400 కిలోల కూరగాయలతో అమ్మవారికి అలంకరణ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మావుళ్లమ్మ సేవా సమితి గౌరవాధ్యక్షుడు పంజా లక్ష్మణరావు, కోరసిక వెంకటేశ్వరరావు, అమృతలూరి భాస్కరరావు, కొండేపూడి గణపతి, కోరసిక కోటేశ్వరరావు, మొదలవలస నాగేశ్వరరావు, కోరసిక వెంకన్న, అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీఎస్ఎం గరల్స్ హైస్కూల్‌కు మైక్‌సెట్ బహూకరణ



భీమవరం పీఎస్ఎం గరల్స్ హైస్కూల్ హెచ్‌ఎంకు మైక్‌సెట్‌ను అందిస్తున్న సునీత

భీమవరం: పట్టణంలోని పొట్టి శ్రీరాములు మునిసిపల్ (పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్‌కు అదే పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న జె.సునీత తన కుటుంబ సభ్యుల పేరున రూ. 25 వేలు విలువైన మైక్‌సెట్‌ను బహూకరించారు. శుక్రవారం స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వారణాశి రాధాకృష్ణకు ఆమె మైక్‌సెట్‌ను అందించారు. ఈసందర్భంగా టీచర్ సునీతను పలువురు అభినందించారు.


భీమవరం సీఐల బదిలీ

భీమవరం: భీమవరం వన్ టౌన్, టుటౌన్ పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను ఏలూరు వీఆర్‌కు పంపించగా ఆయన స్థానంలో తణుకు టౌన్ సీఐగా పనిచేస్తున్న ఎం నాగరాజును నియమించారు. టుటౌన్ సీఐ జి.శ్రీనివాస్‌ను పాలకొల్లు రూరల్ సీఐగా బదిలీ చేయగా ఆయన స్థానంలో ఏలూరు వీఆర్‌లో ఉన్న జి కాళీచరణ్‌ను నియమించారు.

పీహెచ్‌సీలో దాతల సహకారంతో మౌలిక వసతులు







కాళ్ల ప్రభుత్వాసుపత్రిలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన బెడ్లు, బెంచీలు, వాటర్ ఫిల్టర్

కాళ్ల: దాతల సహకారంతో కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు ఏర్పడుతున్నాయి. వైద్యుడు సరాబు సునీల్ దాతలను ప్రోత్సహించి ఆస్పత్రిలో మౌలిక వస్తువుల ఏర్పాటు చర్యలు చేపట్టారు. దాతల సహకారంతో ఆస్పత్రిలో బెడ్లు, వాటర్ ఫిల్టర్, ఫ్యాన్లతోపాటు ఆసుపత్రికి వచ్చిన వారు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు. పెదఅమీరం గ్రామానికి చెందిన సరాబు ముఖేష్, తన తండ్రి చిరంజీవి పేరిట, కాళ్లకూరు గ్రామానికి చెందిన వీరమల్లు సురేష్ తన తల్లిదండ్రుల పేరిట, వనపర్తి మణికుమార్ తన తండ్రి పేరిట, దొడ్డనపూడి గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మణస్వామి తన తండ్రి పేరున ఆస్పత్రిలో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాతలను వైద్యుడు సరాబు సునీల్ అభినందించారు.

ఆకివీడు సీఐగా జగదీశ్వరరావు



వీ.జగదీశ్వరరావు, సీఐ, ఆకివీడు

ఆకివీడు: ఆకివీడు సర్కిల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా వి. జగదీశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొవ్వూరు సీఐగా పనిచేస్తున్న జగదీశ్వరరావుకు ఆకివీడు బదిలీకాగా, ఇక్కడ పనిచేసిన సీఐ సత్యనారాయణను ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉంచారు. జగదీశ్వరరావు బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.

గొల్లవానితిప్పలో నేడు ఉచిత పశు వైద్య శిబిరం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో శనివారం రైతు సేవా కేంద్రం వద్ద పశు సంవర్ధక శాఖ, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల పశు వైద్యాధికారి పి. పుండరీబాబు శుక్రవారం తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా గర్భకోశ వ్యాధులకు నిపుణులతో చికిత్స చేసి ఉచితంగా మందులు ఇస్తామని పేర్కొన్నారు. ఇటువంటి ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆకివీడు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో వివిధ పనుల నిర్వహణ, 11కేవీ లైన్ల దారిలో ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ నిలుపుదల చేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ పీర్ అహ్మద్ ఖాన్ శుక్రవారం తెలిపారు. ఆకివీడు, దుంపగడప గ్రామాల్లోని ఇండస్ట్రియల్ ఫీడర్‌లో 11 కేవీ ఫీడర్స్‌కు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారని చెప్పారు.